ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ మహేశ్

హస్తినాపురం: ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ అన్నారు. శుక్రవారం రాత్రి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీవీకాలనీ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేసి హెల్మెట్ లేకుండా వాహనాలు పడిపిన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపరాదని తప్పనిసరి లైసెన్స్ తీసుకోవాలన్నారు. సైబర్‌నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూపులలో లింకులు పంపించి వాటిని ఓపెన్ చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గిరిష్‌కుమార్, నాగరాజు, అనిల్‌కుమార్‌రెడ్డి, రవినాయక్, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

హస్తినాపురం: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని టీకేఆర్ కాలేజీ సమీపంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీ పత్రాలను శనివారం బాధితుడి భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండగా నిలుస్తుందన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలి



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

లింగోజిగూడ: లింగోజిగూడ డివిజన్ పరిధిలోని హరిజన బస్తీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ ధ్వంసమైన ప్రమాదకరంగా మారింది. లింగోజిగూడ ఓల్డ్ విలేజ్ నుంచి అవేర్ గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లె ప్రధాన రోడ్డులోని మ్యాన్‌హోల్ పైకప్పు భూమిలోకి కుంగిపోయింది. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పార్కింగ్.. పరేషాన్



మలక్‌పేట: చిన్న చిన్న గల్లీల్లో దారికి ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తల్తెతున్నాయిన బాటసారులు వాపోతున్నారు. గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ ఆనుకుని ఉండటంతో ప్రైవేట్ హాస్టళ్లు, వ్యాపార సంస్థలు అధికంగా వెలిశాయి. ప్రైవేట్ హాస్టళ్లకు పార్కింగ్ స్థలం లేకపోవడంలో హాస్టళ్ల ముందున్న రోడ్లపై ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో దారంతా కుంచించుపోయి నడిచేందుకు వీలు లేకుండా పోతుంది. తమ ఇళ్లకు వెళ్లేదారి లేకుండా పోతుందని ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సన్మానం



రామచంద్రరావును సన్మానిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన రామచంద్రరావుకు సైదాబాద్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి ముందు చార్మినార్ వద్ద అమ్మవారి పూజల్లో రామచంద్రరావుతో పాటు జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ పార్టీ కార్యాలయంలో కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టర్ విడుదల

చాదర్‌ఘాట్: ఈ నెల 20, 21 తేదీలలో ఓల్డ్‌మలక్‌పేటలో జరిగే బోనాల సందర్భంగా ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ముద్రించిన ఉత్సవాల పోస్టర్లను శనివారం శ్రీపోచమ్మ దేవాలయ ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు.



అధ్వానంగా రహదారులు

- లలితానగర్‌లో గుంతలమయంగా రోడ్లు
- ప్రమాదాల బారిన వాహనదారులు



లలితానగర్ కాలనీలో గుంతలు పడ్డ రహదారి



రహదారి పక్కన కుప్పలుగా చెత్త, వ్యర్థాలు

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ లలితానగర్ కాలనీలోని రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. సీసీ రోడ్లు ధ్వంసమైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులు వసూలు చేసే అధికారులు ప్రజల మౌలిక సౌకర్యాలు కల్పించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇళ్లల్లో వాటర్, డ్రైనేజీ కనెక్షన్ తీసుకునేందుకు రోడ్లు తవ్వకాలు జరిపి పనులు పూర్తయిన తర్వాత వాటికి మరమ్మతు చేయకపోవడంతో గుంతలమయంగా మారుతున్నాయి. ఇష్టానుసారంగా రోడ్లను తవ్వుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి.

రోడ్ల పక్కనే మట్టి,చెత్త కుప్పలు..

కాలనీలో ఎక్కడ చూసినా రహదారుల పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త, కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు, మట్టికుప్పలే దర్శనం ఇస్తున్నాయి. ఓ పక్క గుంతల రహదారులు, మరో పక్క మట్టికుప్పలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు వాపోతున్నారు. కొత్తగా రహదారులు నిర్మించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తే సమస్యలు పరిష్కారం అవతాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు.

అన్ని రహదారుల అలాగే..

లలితానగర్ కాలనీలోని రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సీసీ రోడ్లన్నీ గుంతమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో రోడ్లపై కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. డ్రైనేజీ, తాగునీరు పైపులు వేసేందుకు తవ్వి వదిలేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. అటుగా రాకపోకలు సాగించే క్రమంలో పొరపాటున మ్యాన్‌హోల్‌లో పడిపోయే ప్రమాదం ఉందని ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధిక కమీషన్ వసూలు చేస్తే చర్యలు తప్పవు



దిల్‌సుఖ్‌నగర్: రైతుల వద్ద అధిక కమీషన్ వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో శనివారం మార్కెట్ కమీషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇతరుల లైసెన్స్ పేరుతో నడుస్తున్న బినామీ ఏజెంట్లపై చర్యలు, కమీషన్ ఏజెంట్లు తీసుకోవాల్సిన బాధ్యతలపై చర్చించారు. మార్కెట్ బయట రైతుల ముసుగులో నడుస్తున్న దళారి వ్యవస్థపై కూడా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, భాస్కరచారి, మచ్చేందర్‌రెడ్డి, లక్ష్మి, గణేష్ నాయక్, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, ఇబ్రహీం, జైపాల్‌రెడ్డి, బండి మధుసూదన్ రావు, నవరాజ్, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

తొలి ఏకాదశికి ఆలయాల ముస్తాబు



హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి

దిల్‌సుఖ్‌నగర్: తొలి ఏకాదశి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మలక్‌పేట్ జోన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సిద్ధం చేశారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, ఐఎస్‌సదన్, సైదాబాద్, మాదన్నపేట, సరూర్‌నగర్ తదితర ప్రాంతాలోని వైష్ణవ ఆలయాలను అలంకరించారు. ఆయా ఆలయాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంది



మన్సూరాబాద్: కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని, కార్యకర్తల మనోవేదనను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి టీనగర్‌కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలనే విషయంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచిన కార్యకర్తలకు పదవుల కేటాయింపు ఆలస్యంపై వివరించినట్లు స్పష్టం చేశారు. త్వరలోనే సానుకూల నిర్ణయాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ లింగారెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజాది కార్యక్రమరాలు ఉంటాయన్నారు.

రూ.2.5 కోట్ల అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ భాగ్యలక్ష్మిని సన్మానించిన కాలనీవాసులు

మలక్‌పేట: అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తి లేదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని సలీంనగర్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ, మూసారంబాగ్, గడ్డిఅన్నారం ప్రాంతాలలో శనివారం రూ.2.5 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త సీసీ రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, జిమ్ పరికరాలు, పార్కుల్లో కొత్త వాకింగ్ ట్రాక్, తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, బస్తీలు, కాలనీలలో మరిన్ని వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి, జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, వాటర్‌వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, ఏఎంహెచ్‌వో రుద్ర శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, హార్టికల్చర్ మేనేజర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.33, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.37, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.60, చామగడ్డ రూ.31, మునగ రూ.55, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.35, బీన్స్ రూ.95, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కాలనీలో కార్పొరేటర్ పర్యటన

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కెపురం డివిజన్‌లోని కాలనీల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి కోరారు. శనివారం డివిజన్ పరిధిలోని వాసవికాలనీ, మార్గదర్శి కాలనీ, యాదవనగర్ తదితర కాలనీలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కాలనీలు, బస్తీలలో పారిశుద్ధ్య పనులు, మురుగునీటి సమస్యలు లేకుండా చూడాలని, కాలనీలో ఎలాంటి సమస్య లున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



సైదాబాద్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేటలోని పాఠశాల ప్రాంగణంలో ఇన్వెస్టీచర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తరగతులు, పాఠశాల వారీగా విద్యార్థుల నుంచి హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను నియమించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ ఏసీపీ చంద్రకుమార్, సైదాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు అభినందనీయం



దిల్‌సుఖ్‌నగర్: ప్రజల సౌకర్యార్థం సొంత డబ్బులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ రతవత్రి అనిల్‌కుమార్, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ రామకృష్ణపురం పార్కులో పీడీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పున్న నిర్మల గణేష్ నేత ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ పార్క్‌ను వచ్చే వారికి ఎంతో ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధుసూదన్ రావు, గోపాల్ రెడ్డి, ధనరాజ్ గౌడ్ సురేష్, తలాటి రమేష్ నేత, గట్ల రవీంద్ర, రాజు నాయక్, పగడాల ఎల్లయ్య, జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవురా సైదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

హస్తినాపురం: నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులు ఇతర విద్యార్థులతో కలిసిపోయి కొత్త వాతావరణానికి అలవాటు పడటానికి ఫ్రెషర్స్ డే వేడుకలు ఉపయోగ పడతాయని నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మన్ గుమ్మకొండ రజని విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిసోరి, ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్లో ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే వేడుకలకు రజిని హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారికి ఇష్టం ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తామన్నారు. విద్యతోపాటు చిన్నారులకు శారీరక, మానసిక వికాసానికి తమ విద్యాసంస్థలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.



సంచార జాతులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

మీర్‌పేట: మండల పరిధిలోని సంచార జాతుల వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయా లని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకుదెరువు, ఇతర చిరు వ్యాపారాల నిమిత్తం సంచార జాతుల వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతంలో నివాసముంటున్నారని తెలిపారు. ఇలాంటి వారు మండల పరిధిలో 600 కుటుంబాలకు పైగా ఉన్నారన్నారు. స్థానికంగా ఉండే సంచార జాతులతో కలిపి వీరికి కూడా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మహిళా కార్యదర్శి యాదమ్మ, సహాయ కార్యదర్శి రెడ్యానాయక్, గిరిజన సమైక్య మండల కార్యదర్శి శత్రునాయక్, రమావత్ పాండునాయక్, ఆర్తి, సోని, కమల, దినేష్, శ్రీకర్, పవన్ ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్ కర్ణన్‌తో రాజశేఖర్‌రెడ్డి, ఈఓ ప్రేమ్‌కుమార్

లింగోజిగూడ: ఫ్లై ఓవర్ నిర్మాణంలో భూమి, నిర్మాణాలు కోల్పోయిన ఎల్‌బీనగర్ శ్రీ ప్రసన్నంజనేయ దేవాలయానికి రావాల్సిన నష్ట పరిహారం విడుదల చేయాలని శనివారం లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఎల్‌బీనగర్ ఈఓ ప్రేమ్ కుమార్‌తో కలిసి జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మాల్ మైసమ్మ ఫ్లై ఓవర్ నిర్మాణ సమయంలో ఎల్‌బీనగర్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయానికి చెందిన 1232 గజాల స్థలంతో పాటు ఆ స్థలంలోని నిర్మాణాలను తొలిగించి ఫ్లై ఓవర్ నిర్మించారని అన్నారు.సంత్సరాలు గడుస్తున్న నిర్మాణ సమయంలో చేసుకున్న ఒప్పంద ప్రకారం రావాల్సిన నిధులు విడుదల చేయలేదని వెంటనే దేవాలయానికి రావాల్సిన నిధులను విడుదల చేయాలని వినతిలో కోరారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



అశోక్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ శ్రీశంకర్ కాలనీ, భరత్ నగర్ ఫేస్-2, శివగంగకాలనీ, మారుతినగర్, మోహన్‌నగర్ విలేజ్, నాగేశ్వర్‌నగర్ కాలనీల్లోని డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్‌లో వివిధ కాలనీల్లో పాత డ్రైనేజీ లైన్ కావడంతో నిత్యం మురుగు ఏరులై పారుతుందన్నారు. డ్రైనేజీలు లీకేజీ కావడంతో తాగునీటి కలుషితం అవుతుందని వెంటనే నూతన లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

మన్సూరాబాద్: శ్రీకృష్ణ సమిత బలరామ సుభద్రదేవి జగన్నాథ రథయాత్ర మన్సూరాబాద్ విజయశ్రీకాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం నుంచి వైభవంగా ప్రారంభమైంది. భక్తి కుటీర్ వనస్థలిపురం, ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్రలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరై ఆనందోత్సవాలతో రథాన్ని లాగారు. మహిళలు, యువత, భక్తుల సాంస్కృతిక ప్రదర్శనలతో రథయాత్ర అట్టహాసంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోన్నాడ మోహన్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు, సబితాఇంద్రారెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు టి.మనోజ్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం బీజేపీ నాయకుల బృందం మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో రహదారులు లేకపోవడంతో స్థానిక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారన్నారు. ప్రస్తుతం బోనాలు కూడా సమీపిస్తుండడంతో పెద్ద ఎత్తున ముత్యాలమ్మ ఆలయానికి తరలి వస్తారన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న చంద్రమోహన్

మన్సూరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేఖ విధానాలపై ఈ నెల 9న జరిగే సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్ పారిశ్రామిక వాడలోని టీసీఐ ఫైట్ ఇండియా లిమిటెడ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కార్మికుల కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులతో సహా అన్ని తరగతుల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని కోరారు.

మార్కెట్ అభివృద్ధిలో హమాలీల పాత్ర కీలకం



చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో హమాలీల పాత్ర కీలకమైందని ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి అన్నారు. ఆయన ఎస్‌జీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శనివారం అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం నాయకులు ఆయనను మార్కెట్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎస్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో పని చేసే లైసెన్స్‌డ్ హమాలీలకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫామ్‌లు, ఐడీ కార్డులు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మార్కెట్‌లో పనిచేసే కార్మికులకు మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-3 కార్యదర్శి పుష్ప, సూపరింటెండెంట్ మాధురి, జలజాక్షి, అఖిల, హైదరాబాద్ హమాలీల సంఘం అధ్యక్షుడు సురేష్, శేఖర్, కథలయ్య, రవీందర్, కుమార్, రాజు, మురళి, నర్సింగ్‌రావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.